ప్రజాశక్తి

సోమవారం 11 ఆగష్టు 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





కొత్త జిల్లాల ప్రక్రియలో

కదలిక ఏదీ.?

- మంత్రుల కమిటీ పర్యటన ఉంటుందా?
- నెల రోజుల్లో నివేదిక కోరిన సిఎం చంద్రబాబు
- ఏదో చేస్తున్నామనే చర్చ కోసం అప్పుడప్పుడూ తెరపైకి..



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'మార్కాపురం జిల్లా ఏర్పాటు'.. 'అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశంలో విలీనం'.. ఇవి ఎన్నికల ముందు తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రజానీకానికి ఇచ్చిన హామీలు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టాం. ఇంతవరకూ కొత్త జిల్లాల ఏర్పాటు ఎండమావిగానే ఉంది. మార్కాపురం జిల్లా కోసం అప్పట్లో ఆందోళన చేపట్టిన పార్టీల్లో తెలుగుదేశం, జనసేన కూడా ఉన్నాయి. దీక్షల్లోనూ పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వంపై పోరాటం సాగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎవరూ ఆందోళనలు చేయడం లేదనే భావనా? లేక ఎప్పుడోకప్పుడు చేద్దామనే ఉదాసీనతా? తెలియదు గానీ ఇంతవరకూ దానిపై చిత్తశుద్ధి కనిపించడం లేదు. ఏదో చేస్తున్నామనే భావన జనంలో కల్పించేందుకు అప్పుడప్పుడూ కొత్త జిల్లాల చర్చ తెరపైకి తెస్తున్నారు.

ఏడాదిగా ఏమీ చేయని ప్రభుత్వం ఇటీవల దీనిపై మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశారు. నెల రోజులు గడిచింది. ఆ కమిటీ ఏం చేస్తుందో స్పష్టత లేదు. ప్రజల నుంచి ఏమైనా విన్నపాలు స్వీకరించారా? అంటే అదీ ఎవరికీ తెలియదు. ఎవరికి ఇవ్వాలనేదీ పార్టీలకు కూడా స్పష్టత లేదు. తాజాగా మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సిఎం చంద్రబాబు దీనిపై మాట్లాడారు. జిల్లాల పేర్లు, మార్పులు, చేర్పులపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రులతో ఏర్పాటైన కమిటీని ఆదేశించినట్లు చెబుతున్నారు. నెల రోజుల్లో నివేదిక ఇవ్వడానికి ఆ కమిటీ తమకు అప్పగించిన ప్రక్రియనే ఇంతవరకూ మొదలు పెట్టలేదు. రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు అసంబద్ధంగా ఉందని ఆందోళన చేపట్టిన ప్రాంతాల్లో చూస్తే మార్కాపురం స్పష్టంగా ఉంది. దీనిపై ఎటువంటి అభ్యంతరాల్లేవు. అన్ని పార్టీలూ ఆనాడు మార్కాపురం జిల్లా కోసం గొంతెత్తాయి. వైసిపి నేతలు కూడా లేఖలు ఇచ్చారు. అన్ని పార్టీలూ దీనిపై గళం విప్పాయి. తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించాయి. అదేవిధంగా విలీనం చేయాల్సిన నియోజకవర్గాలపైనా స్పష్టత ఉంది. అయితే జిల్లాకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ సిఎం చంద్రబాబు మార్కాపురం జిల్లాను చేస్తామంటూ మరోసారి వాగ్దానం చేసి వెళుతున్నారు. మార్కాపురం పర్యటనలో ఇదే చెప్పారు. ఆచరణలోనే ముందుకు సాగడం లేదు. తాజాగా నెల రోజుల్లో ▶ 2లో



ట్రాక్టర్ ర్యాలీలో మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుకు డబ్బులు

మంత్రి స్వామి

▲ 5లో

వ్యవసాయాన్ని

కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ప్రతిఘటిద్దాం..

- ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు
- 13న ఒంగోలులో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లతో ప్రదర్శన



మాట్లాడుతున్న ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రధాని నరేంద్ర మోడీ విధానాలను ప్రతిఘటించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పిలుపునిచ్చారు. క్విట్ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో ఈ నెల 13న ఒంగోలులో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్ళతో ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంపై చర్చించటానికి సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమావేశం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జి. జయంతి బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చుండూరు రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని దేశం నుండి తరిమి కొట్టడానికి ఆనాడు జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా పిలుపునిచ్చిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు కట్టబెట్టే మోడీ విధానాలను దష్టిలో ఉంచుకొని క్విట్ కార్పొరేట్ నినాదంతో సంయుక్త కిసాన్ మోర్చా ట్రేడ్ యూనియన్లు ఈ నెల 13న జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి ఏకగ్రీవంగా ▶ 2లో

కొత్త జిల్లాల ప్రక్రియలో కదలిక ఏదీ.?

(మొదటిపేజీ తరువాయి)

నివేదిక ఇవ్వాలని కోరడంతో మళ్లీ పార్టీల్లోనూ చర్చగా మారింది. అయితే ఈ కమిటీ కనీసం జిల్లాకు వస్తుందా.? లేదా.? అనేదీ తెలియడం లేదు. పర్యటనపై ఇంత వరకూ అధికారులకూ సమాచారం లేదు. నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలంటే కనీసం మార్కాపురం ప్రాంతంలోనైనా పర్యటించాలి. ఆ దిశగా ఎటువంటి జాడలూ కనిపించడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్దఎత్తున హంగామా చేసిన తెలుగుదేశం నేతలు ఇప్పుడు దానిపై మౌనంగా ఉన్నారు. సభల్లో చేస్తున్న ప్రసంగాల్లో మార్కాపురం జిల్లా చేస్తామని చెప్పడం తప్ప రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడికి ఎటువంటి చర్యలూ కనిపించడం లేదు. నెల రోజుల్లో నివేదిక అనే చర్చ వచ్చినందున ఈ నివేదిక ఆధారంగానే జిల్లాల పునర్విభజన ఉంటుందా? లేక ఓటర్ల జాబితా పూర్తయ్యాక ఉంటుందా? అనే చర్చ కూడా సాగుతోంది. ఇప్పుడు చేయకుంటే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తర్వాతేననే చర్చ కూడా వినిపిస్తోంది. కారణాలేమైనా కొత్త జిల్లాల ప్రక్రియ ప్రహసనంగా మారింది.

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ప్రతిఘటిద్దాం..

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానించారు. క్విట్ఇండియా నినాదంతో ఈనెల 13న ఒంగోలు మినీ స్టేడియం నుండి అద్దంకి బస్టాండ్ వరకు ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లతో ప్రదర్శన నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. సమావేశంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఏఐకెఎంఎస్ నాయకులు కోడూరు హనుమంతరావు, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. లలిత కుమారి, కాంగ్రెస్ రైతు విభాగం నుండి కొండ్రుగుంట సుబ్బారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, డిసిసి అధ్యక్షులు షేక్ సైదా, ఇరిగినేని వెంకట నరసయ్య పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ఘనంగా బోనాల పండుగ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వానలు కురిసి పంటలు పండాలని, భూమి పచ్చదనం నిండిపోవాలని, బోర్లకు నీరు చేరాలని ఆకాంక్షిస్తూ పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల గ్రామంలో ఆదివారం సాంప్రదాయ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలు పోలేరమ్మ, అంకాలమ్మలకు భక్తులు ప్రత్యేకంగా బండ్లు కట్టి ఊరంతా ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. ఉదయం నుంచే గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. మహిళలు రంగురంగుల చీరలు, ఆభరణాలతో అలంకరించుకొని బోనాలు మోసుకొచ్చారు. బోనాలను పసుపు, కుంకుమ, తూర్పు, ఆకుపచ్చ ఆకులతో అందంగా అలంకరించారు. తంబూర, డప్పుల వాయిద్యాల మధ్య భక్తులు నృత్యాలు చేస్తూ బోనాలను దేవాలయానికి చేర్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాలు మోసుకొచ్చారు. పక్క గ్రామాల ప్రజలు కూడా వచ్చి ఈ వేడుకలను తిలకించారు. ఈ సంవత్సరం వానలు ఆలస్యంగా రావడంతో పొలాల్లో విత్తనాలు వేశారు కానీ తగినంత తేమ లేదు. అందుకే దేవతలకీ బోనాలు పెట్టి వర్షాలు రావాలని కోరుకున్నామని రైతులు తెలిపారు.

శాస్త్రీయ సమాజం కోసం

జెవివి కృషిలో భాగస్వాములు కండి!

ప్రజాశక్తి-గిద్దలూరు

జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 18వ మహాసభలు పట్టణంలోనిలోని కెఎస్‌వి గ్రాండ్ (ఎస్ఎస్ ప్లాజా)లో శనివారం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభకు జెవివి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి మురళీధర్ పరిశీలకులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజం ఏర్పాటు లక్ష్యంగా గత 38 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు, డాక్టర్లు, మేధావులు, ఆలోచనాపరులు, సైన్స్ అభిమానులను కోరారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి మాట్లాడుతూ వ్యాధి ఉన్నచోట వైద్యంతో కూడిన శస్త్ర చికిత్స ఎంత ముఖ్యమో, అజ్ఞానం ఉన్నచోట జ్ఞానంతో కూడిన శాస్త్ర ప్రచారం అంతే ముఖ్యమని అన్నారు. శాస్త్ర ప్రచారాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత జెవివి కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పి స్వరూపరెడ్డి మాట్లాడుతూ మూఢవిశ్వాసాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య–మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం కోసం కృషి చేయవలసిన బాధ్యత విద్యావంతులైన ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు వి మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు విజయవాడ బుక్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల, ఒంగోలులో నిర్వహిస్తున్న బుక్ ఫెస్టివల్‌లో పాల్గొనాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. ఈ ప్రతినిధుల సభ జిల్లాలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని, మూఢవిశ్వాసాల నిరోధక చట్టం తీసుకురావాలని, మహిళలపై అత్యాచారాలను–వివక్షతను అరికట్టాలని, వెలుగొండ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయడంతో పాటు జిల్లా అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ రంగంలోనే ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన విద్యను అందించాలని ఐదు తీర్మానాలను ఆమోదించింది. ఈ ప్రతినిధుల సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ జయప్రకాష్, యు భాస్కర్, సిహెచ్ శోభన్‌కుమార్, కె సుబ్రహ్మణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్



కొత్తగా ఎన్నికైన జెవివి నూతన కమిటీ

జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి



వెంకట్రావు



శ్రీనివాసరెడ్డి

జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 18వ మహాసభలలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి ప్రకటించారు. జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ బి జవహర్, డాక్టర్ బి హరిబాబు, డాక్టర్ టి చెన్నకృష్ణ, ప్యాట్రన్స్‌గా ఎవి పుల్లారావు, కే సుబ్రహ్మణ్యచారి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా యు వెంకట్రావు, జి శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా బి తిరుపతయ్య, ఉపాధ్యక్షులుగా డిఎల్ ప్రసాద్, షేక్ ఖాజా హుస్సేన్, యు భాస్కర్, నల్లూరి వెంకటేశ్వరావు, మండ్ల శ్రీనివాసులు, డి గురుస్వామి, కార్యదర్శులుగా బి దేవప్రసాద్, ఎ విశ్వరూపం, ఎన్‌టి వెంకటేష్, డి బాలు నాయక్, ఏనుగుల రవికుమార్, వివిధ సబ్ కమిటీల కన్వీనర్లుగా డాక్టర్ బి శరత్ (ఆరోగ్య విద్య), షేక్ బషీరున్నీసా బేగం(సమతా), రమణయ్య (సాంస్కృతికం), ఎస్‌వి రంగారెడ్డి (శాస్త్ర–సాంకేతిక), జె శేఖర్ (సోషల్ మీడియా), వి మాలకొండారెడ్డి (ఆడిట్ కమిటీ), మరో 40 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మహాసభ ముగింపు సమావేశంలో నూతనంగా ఏర్పడిన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు వెంకట్రావు, జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రభుత్వ- ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లోని 8 ,9 ,10 తరగతి విద్యార్థులకు సెప్టెంబర్ 20 తేదీన నిర్వహించనున్న పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలను జయప్రదం చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-గిద్దలూరు



విద్యార్థులతో మాట్లాడుతున్న మొర్రి పిచ్చయ్య యాదవ్

స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖన పోటీలను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొర్రి పిచ్చయ్య యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖన పోటీల ద్వారా విద్యార్థులు తమ సజనాత్మకతను మరియు నైపుణ్యాలను పెంపొందించడానికి ఒక అద్భుతమైన మార్గం అని, పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడమే కాకుండా తమ నైపుణ్యాలను ప్రదర్శించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎన్ ప్రసన్నకుమారి, గిద్దలూరు శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి రామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి ఓబులేసు, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి డి నారాయణ రెడ్డి, బాలవికాస్ ఉపాధ్యాయురాలు ఏ శశికళ దేవి, కార్యదర్శి ఎస్‌డి ఫరూఖ్, ఎస్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు



జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభిస్తున్న డీఈఈ పద్మావతి

సంతనూతలపాడు ఓఅండ్ఎం సబ్ డివిజన్ పరిధిలోని ఎన్ఎస్పి ఈతముక్కల మేజర్ వద్ద 6.80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను సంతనూతలపాడు ఎన్ఎస్‌పి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ పద్మావతి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు సబ్ డివిజన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు రామా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఎన్ఎస్‌పి ఏఈ షేక్ కరిముల్లా మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఎన్నెస్పీ సబ్ డివిజన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు టీడీపీ నాయకులు రామా గోపి, నీటి సంఘాల అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, అబ్బూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మార్కాపురం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల బృందం

పదో తరగతి 2003–2004 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 21 సంవత్సరాల తరువాత తిరిగి కలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన తమ పాఠశాల ఉపాధ్యాయుల వద్ద నుంచి ఆత్మీయ ఆశీర్వాదాలు తీసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను ఆప్యాయంగా పలకరించుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలను మరొక్కసారి తనివితీరా చూసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. గురువులను శాలువాలు, మొమెంటోలతో సన్మానించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. దీనికి మార్కాపురం మండలం వేములకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదివారం వేములకోట ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొన్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు విచారించి పులకించిపోయారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సమ్మేళనంలో పాఠశాల ప్రస్తుత హెడ్మాస్టర్ వై సుబ్బారెడ్డి, అప్పటి హెడ్మాస్టర్ అన్విలాసిని, ఉపాధ్యాయులు ఎం తిరుపతిరెడ్డి, సిహెచ్ మహేశ్వరరెడ్డి, కె ఆంజనేయరెడ్డి, లక్ష్మీకుమారి, చలపతిరావు, సంపత్ కుమార్, 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025

కబ్జా కోరల్లో ఎన్‌ఎస్‌పి కాలువ

సాగునీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు


నిద్రావస్థలో ఎన్‌ఎస్‌పి అధికారులు

ప్రజాశక్తి-మద్దిపాడు

చివరి భూమి వరకు నీరందాలి.....నీళ్లు లేక ఏ ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదు అంటూ అధికారులు నిత్యం చెబుతూ ఉంటారు. అలాంటిది దిగువ భూములకు నీళ్లు నిలిచాయి. అసలు ఎన్‌ఎస్‌పి కాలువనే కిలోమీటర్ల దూరం మాయం చేసి తమ పొలాలకు చదును చేసుకుని పైర్లు వేస్తున్నారు. అసలు కాలువ ఇక్కడ ఉందనే ఆనవాళు కూడా కొన్నిచోట్ల కనిపించకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఈ కాలువపై పర్యవేక్షించాల్సిన ఎన్‌ఎస్‌పి అధికారులు నిద్రపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మండల పరిధిలోని దొడ్డవరం-తెల్లబాడు గ్రామంలో ఉన్న మైనర్ ఎన్‌ఎస్‌పి కాలువ ద్వారా సాగర్ జలాలు వస్తుంటాయి. కొన్ని సంవత్సరాల నుంచి ఈ కాలువ అక్కడక్కడ ఆక్రమణలకు గురవడంతో పాటు కిలోమీటర్ల దూరంలో కాలువ మాయమైంది. పలువురు కాలువను తమ పొలాల్లో చదును చేసుకుని ఆక్రమించుకున్నారు. కాలువ పక్కన ఉన్న రైతులు పంటలకు నీళ్ల అవసరం అయిన ప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ఎన్‌ఎస్‌పి కాలువను గుండ్లకమ్మ జలాశయం ఏర్పాటు సమయంలో హైలెవల్ కెనాల్ నిర్మించి అనుసంధానం చేసిన ప్రయోజనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చుట్టూ పక్కల కుంటలు, చెరువులు ఏమైనా ఉంటే వాటి మీదనో లేకపోతే ఇంజన్ల ద్వారా దూరం నుంచి నీళ్లను తరలించుకుంటూ పంటలను పండిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎక్కువ మంది ఆ పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తుండటంతో ఎవరూ కూడా కాలువ గురించి పట్టించుకోలేదని సమాచారం. 1983లో తెల్లబాడు గ్రామంలో సర్వే నెంబర్ 357/2బి లోని 0.41 సెంట్లుకు నష్టపరిహారం చెల్లించి ఎన్‌ఎస్‌పి కాలువను ఏర్పాటు చేశారు. ఆ సర్వే నెంబర్‌లో సబ్ డివిజన్‌కు చెందిన రైతులు పరుచూరి చిరంజీవి వీరయ్య చౌదరి, పరుచూరి నరసింహారావు, నాగినేని మాధవి ఎన్‌ఎస్‌పి కాలువను పూడ్చి చదువును చేసుకున్నారని, దిగువ భూముల రైతులకు నీరు వెళ్లకుండా చేశారని దిగువ భూముల రైతులలో ఒకరైన రైతు కాట్రగడ్డ సీతారామంజనేయులు తెలిపారు. ఈ విషయం గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేరని వారు వాపోతున్నారు.


కాలువను చూపిస్తున్న మ్యాప్

చివర భూములకు నీరందించాలని అధికారులు చెబుతున్నా కాలువలు ఆక్రమణలకు గురికావడంతో ఆ లక్ష్యం నెరవేరడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మేల్కొని ఎన్‌ఎస్‌పి కాలువను పునరుద్ధరించి దిగువ భూముల రైతులకు నీరందించాల్సిందిగా ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

పి-4 విధానంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చిన పి-4 విధానానికి దాతల అద్భుతమైన స్పందనతో ప్రభుత్వ కార్యాలయం నిర్మాణానికి ముందుకు వచ్చారని ఇది ఎంతో సంతోషాన్ని కల్గించ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరిలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వానికి భారం లేకుండా, ప్రజల అవసరాలను తీర్చే విధంగా సదుపాయాల సృష్టి జరుగుతోందన్నారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రైవేట్ స్థలంలోనే దాతల సహకారంతో కార్యాలయం నిర్మించడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి రూ.2 కోట్లతో విలువైన స్థలం మరియు నిర్మాణానికి కావలసిన సౌకర్యాలు నందిత శ్రీ, నివేదిత శ్రీ డెవలపర్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నామని, రెండు మూడు రోజుల్లోనే జీవో విడుదల కానుందని చెప్పారు. మన కనిగిరిని మనం అభివృద్ధి చేసుకుందాం అన్న నినాదంతో ముందుకు వచ్చిన దాతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఈ విధానంలో అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు, దాతలు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ... ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

వాహనాలు దాటే క్రమంలో యువకులు మధ్య ఘర్షణ నెలకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని సీతారాంపురం కోష్టాలు సెంటర్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పెద్దకొత్తపల్లి అంజయ్య నగర్‌కు చెందిన యువకులకు, ఇనమనమెల్లూరుకు చెందిన యువకులకు వాహనాలు దాటే క్రమంలో ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో అంజయ్య నగరకు చెందిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ గొడవకు మద్యం మత్తు కూడా ఒక కారణం అని సమాచారం. ఈ ఘటనపై ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా మాజీ మంత్రి శిద్దా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక హరిహర క్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్స్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు ఆయన కుమారుడు శిద్దా సుధీర్ కుమార్‌లకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హరిహర క్షేత్రంలో వివిధ ఆలయాలలో శిద్దా రాఘవరావు దంపతులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపటానికి జిల్లా పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, నాయకులు తరలివచ్చారు. దర్శి నియోజకవర్గం నుంచి విశేష సంఖ్యలో అభిమానులు బారులు తీరారు. ఆయనకు పలువురు గ్రానైట్ ప్రముఖులు, ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మద్దిపాడు ఏఎంసి చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, ఆపిల్ గ్రానైట్స్ అధినేతశిద్దా సూర్య ప్రకాష్ రావు, గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి అజీమ్,ఆర్ ఆర్ ఆర్ గ్రానైట్స్ అధినేత ఆర్ పి రవి, మండవ ఎక్స్‌పోర్ట్స్ అధినేత మండవ శ్రీనివాసరావు, మండవ ట్రాన్స్‌పోర్ట్ అధినేతలు మండవ గోపి, మండవ శ్రీనివాసరావు, బివిఎల్ వెంకట్రావు, మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, గెలాక్సీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండవీటి ఏడుకొండలు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, శిద్దా సుధాకర్,ఎడ్లపల్లి రామబ్రహ్మం, కందిమల్ల గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఆర్ రాంబాబు, మందలపు వెంకట్రావు, కవుత్రపు రాఘవరావు, ఏ వెంగన్నా, శాసనాల వీరబ్రహ్మం, బొమ్మిశెట్టి రవి కిరణ్ కుమార్, గ్రంధి శ్రీహరి, నూకల సురేంద్ర కుమార్, బల్లికురవ లక్ష్మీ గ్రానైట్స్ ఇంచార్జ్ కృష్ణారావు, కామాక్షి గ్రానైట్స్ ఇంచార్జ్ అనిల్ కుమార్ రెడ్డి, గోల్డెన్ గ్రానైట్స్ ఫణి కుమార్, గుప్తాస్ వీరబాబు, రంగమన్నార్, ఆర్యవైశ్య ప్రముఖులు,మహిళలు, వాసవి క్లబ్ నాయకులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్


పారిశుధ్య కార్మికులకు యాప్రాన్లు అందజేస్తున్న శిద్దా దంపతులు

శిద్దా పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు:

స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 120 మందికి యాప్రాన్లు, గ్లౌజులు అందజేశారు. ఎస్ కే ఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లు అందజేశారు. పాటిమీద పాలెం పాఠశాల మధ్యాహ్న భోజనానికి ఆర్థిక సాయం అందజేశారు. మొక్కలు పంపిణీ చేశారు. ఖాదరభాష వృద్ధాశ్రమానికి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో సంతృప్తి ఉంటుందన్నారు.

ఒంగోలులో శిద్దా పుట్టినరోజు వేడుకలు:

ఒంగోలులో లాయర్ పేటలోని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. అభిమానులు మరియు లక్ష్మీ గ్రానైట్స్ బల్లికురవ ఇంచార్జ్ ఉప్పుటూరి కృష్ణారావులు ఏర్పాటు చేసిన వేరువేరు భారీ కేకులను శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, శిద్దా ఆంజనేయ ప్రసాద్, శిద్దా పవన్ కుమార్, ఎస్ ఆర్ ఆర్ గ్రూప్ ఆఫీస్ ఇంచార్జ్ అద్దంకి మురళీకృష్ణ, ఆర్ లక్ష్మీనారాయణ, గూడూరు శ్రీనివాసులు, జ్యోతి ఎక్స్‌పోర్ట్స్ సీఈవో శివరాం, శిద్దా భరత్, టి అరుణ, గుమ్మడి సాయిబాబు,చందోలు మణికంఠ పాల్గొన్నారు.

దర్శి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు సందర్బంగా శిద్దా ప్రతినిధి మండాది సుబ్బారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మునిసిపల్ కార్మికులకు అన్నదానం, గొడుగుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మరియు శిద్దా యువత బొగ్గరపు సుబ్బారావు, ఆయిల్ శ్రీను, సత్యం, మల్లి, జెమిని, అనీల్, శ్రీను, వీర, లోకేష్, వెంగయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకొని మహిళ మృతి

ప్రజాశక్తి-కొండపి : మనస్తాపంతో ఉరేసుకొని మహిళ మృతి చెందిన సంఘటన కొండపి మండలంలోని పెదకండ్లగుంటలో జరిగింది. ఎస్ఐ ప్రేమకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకళ్లుంట గ్రామానికి చెందిన పాలపర్తి రాజశ్రీ(29) భర్త పోతురాజు నిత్యం మద్యం తాగుతుంటాడు. తాగుడు మానుకోమని ఎన్ని సార్లు చెపిన వినకపోవడంతో విసుగు చెందిన రాజశ్రీ మనస్థాపం చెంది తన ఇంట్లో వంట రూంలో చీరతో ఉరి వేసుకొని మృతి చెందింది. ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ప్రేమ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీసీపల్లి : కిడ్నీ వ్యాధితో మండలంలోని దివాకర పల్లికి చెందిన వజ్రాలు చిన్నయ్య(57) ఆదివారం మృతి చెందారు. ఈయన గత ఆరు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వ్యాధి తీవ్రం కావడంతో ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఒంగోలు మృతి చెందారు. చిన్నయ్య మృతికి మాజీ సర్పంచ్ శీలం సుదర్శనం, చీమలదీన్నె బాల అంకయ్య తదితరులు సంతాపం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు : విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దొడ్డవరంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అడక శ్రీనుకు చెందిన గేదెను రోజు మాదిరిగానే మేతకు తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి మృతి చెందింది. సుమారు లక్షా పదివేల విలువ చేసే గేదే మృతి చెందిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


యజమానులకు వివరాలు అందజేస్తున్న సయ్యద్ హనీఫ్

ధరల ఒప్పందం ఏకగ్రీవం

ప్రజాశక్తి-పామూరు : వ్యాపార యజమానులకు, కూలీలకు మధ్య ధరల ఒప్పందం ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నట్లు సిఐటియు గౌరవ అధ్యక్షులు సయ్యద్ హనీఫ్ అన్నారు. ఆదివారం విలేకరులతో హనీఫ్ మాట్లాడుతూ గ్రానైట్, మార్బుల్, టైల్స్, యజమానులకు బజార్ ముఠా కార్మికులకు కూలీల సమస్య పరిష్కారం జరిగినట్లు ఆయన తెలిపారు. రెండు సంవత్సరాల ఒప్పందం కుదిరిందన్నారు. గ్రానైట్ టన్నుకు దిగుమతి గతంలో 400 ఈ సంవత్సరం 430, మార్బుల్ 350 ప్రస్తుతం 375 రూపాయలు పెంచుకున్నట్లు తెలిపారు. పార్కింగ్ టైల్స్ ఎగుమతి, దిగుమతులకు రెండు రూపాయల నుంచి రూ.5కు పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు పి.సురేష్, పి.మల్లికార్జునరెడ్డి, జాజాం నాగేశ్వరావు, ఒంటెలప్రసాద్, ముఠా కార్మికులు పందిటి శీను, మోరుబోయిన శ్రీను, నాగి సురేష్, గురు ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.మాల్యాద్రి, వేట వీరనారాయణ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు మాజీ సర్పంచ్ మాదాసు కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా ఆదివారం పెదకాకాని శంకర కంటి వైద్యశాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో మాదాసు కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 148 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. అనంతరం మాదాసు కృష్ణమూర్తి ఇంటివద్ద నుంచి స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయం సెంటరు రాఘవేంద్ర కాలనీలో ఉన్న కృష్ణమూర్తి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సర్పంచ్‌గా 18వ సంవత్సరాలు పాటు పనిచేసి గ్రామాభివృద్ధి ఎనలేని కృషిచేసారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అమరా వెంకట సుబ్బారావు, ఒరుగంటి మురళీ, మాదాసు నాగేశ్వరరావు, రాంబాబు, లక్ష్మిశెట్టి శ్రీరాములు, పెంట్యాల శ్రీనివాసరావు, ఆయన కుమారుడు మధు, సతీమణి లీలావతి పాల్గొన్నారు.

యువతిపై దాడి చేసిన శ్రీకృష్ణను అరెస్టు చేయాలి

- బాధితులపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసులు
- దోషులను రక్షించే ప్రయత్నంలో పోలీసులు
- రజక యువతికి న్యాయం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

అహంకారంతో కారంచేడులో మూగ, చెవిటి రజక యువతి దేవికపై దాడి చేసిన యార్లగడ్డ శ్రీకృష్ణ, అతని భార్యను తక్షణమే అరెస్టు చేసి బాధిత రజకులపై పెట్టిన తప్పుడు కేసు ఎత్తివేయాలని రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని, ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్జీఒ కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఒక గ్రామంలో బలహీన వర్గానికి చెందిన రజకులపై ఎటువంటి విచారణ లేకుండా కేసు నమోదు చేయడం న్యాయ విరుద్ధమని పేర్కొన్నారు. ఎస్ఐ కూడా వాస్తవాలు విచారించకుండా దాడి చేసిన వారి పక్షానే మాట్లాడుతున్నారని అన్నారు. కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆడవారి విషయంలో జోక్యం చేసుకున్న శ్రీకృష్ణ కుల అహంకారంతో దుర్భాషలాడి, కర్రతో దాడి చేసి, అనంతరం ఇనుపరాడ్ తీసుకొని వచ్చి మహిళను



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎం వసంతరావు

కొట్టాడని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. చెవుడు, మూగ యువతిని తలపై ఇనుపరాడ్‌తో బలంగా కొట్టి, పిడికిలితో గుద్దడంతో తీవ్ర గాయాలు కలిగించాడని అన్నారు. అతని భార్య కూడా దాడికి సహకరించిందని ఆరోపించారు. ఈ దాడిలో దేవిక తలకు 12 కుట్లు వేసినట్లు తెలిపారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య మాట్లాడుతూ రజకులను చాకలోడు, చాకలి వంటి పదాలతో సంబోధించడం జీఒ నెంబర్ 38 ప్రకారం నేరమని గుర్తు చేశారు. శ్రీకృష్ణపై ఇన్ని నేరాలు ఉన్నప్పటికీ అతనిని వదిలేసి, అతని ఫిర్యాదు మేరకు బాధితులైన రజకులపై కేసు నమోదు చేయడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని అన్నారు. బాధితురాలిని ఇంతవరకు పోలీసులు పరామర్శించకపోవడం, సాక్షులను విచారణ కోసం పిలవడం వంటి అంశాలపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై న్యాయం సాధించే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని తీర్మానించారు. తమ డిమాండ్లను వివరిస్తూ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశానికి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చేనేత జనసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల మోహన్‌రావు, సిపిఎం నాయకులు ఎం వసంతరావు, అంబేద్కర్ సొసైటీ నాయకులు కంచర్ల చిట్టిబాబు, బీసీ రాష్ట్ర నాయకులు కాకర్ల యేసు, రజక నాయకులు బ్రహ్మయ్య, రాఘవయ్య, కొండవీటి శీను, వీరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

గిరిజన రైతులకు పెట్టుబడి సాయం చేయాలి

ప్రజాశక్తి - బల్లికురవ

గిరిజన రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో గిరిజన రైతులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో సుమారు 120 మంది గిరిజన రైతులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం 5గురికి మాత్రమే పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ ఇచ్చిందని అన్నారు. మిగతా రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అందించడంలో గిరిజనులు వివక్షకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి రమణయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తంగిరాల వెంకటేశ్వర్లు, గొల్లపూడి అంజయ్య పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రీన్ స్పార్క్, నోవా అగ్రిటెక్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం ఆవరణలో శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో 751 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 334 మందికి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ఒక్కరు కంటి సమస్యతో బాధ పడకూడదనే లక్ష్యంతో నిరంతరం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మార్టూరు అధ్యక్షులు తాటి నాగేశ్వర రావు, నల్లపునేని రంగయ్య చౌదరి, రాయపాటి సీతయ్య, తారక రామారావు, సాంబయ్య, పోపూరి శ్రీనివాసరావు, శివ నాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, కోటా కృష్ణ, గోరంట్ల శ్రీనివాసరావు, సుబ్బయ్య, మందపాటి అంజయ్య, శరత్, విజయ్ పాల్గొన్నారు.



డాక్టర్ కావ్యను సత్కరిస్తున్న వైద్యశిబిరం నిర్వాహకులు

ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్, ఎవిఐఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రేణింగివరం రోడ్డులోని అహ్మద్ స్పెషాలిటీ క్లినిక్ నందు వెరికోస్ వేన్స్ బాధితులకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 75మంది శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హాస్పిటల్ డాక్టర్ కావ్య, సహాయక సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో చిన్ని కామేశ్వరరావు, శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, లేవీ ప్రసాద్, అంజాద్ భాష, మహమ్మద్ రఫీ, చందూరి మురళి, శ్రీనివాస ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడ్డ ప్రభుత్వం

ప్రజాశక్తి - చీరాల

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య చెప్పారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ కృతజ్ఞత ట్రాక్టర్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించే శక్తి రైతు అన్నారు. ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు చెమట చుక్క కూడా వృథా కాకుండా చూడడం తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని విమర్శించారు. జగన్ పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసుపుస్తకాలపై బొమ్మ ముద్రించుకున్నారని, తమ ప్రభుత్వం రైతులకు గౌరవప్రదంగా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో వేలాది మంది రైతులు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమని అన్నారు. ఇకపై అలాంటి పరిస్థితులు రాకుండా సమగ్ర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు కష్టానికి తగిన విలువ కల్పించడమే తమ లక్ష్యమని, రైతు క్షేమం కోసం ఎటువంటి కృషికైనా వెనుకాడబోమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, ఎఎంసి ఛైర్మన్ కౌతరపు జనార్ధనరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ వివాదం ముగియాలి

ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ ఆకాంక్ష

ప్రజాశక్తి - చీరాల

తెలుగు సినీ పరిశ్రమలో ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సినీ కార్మికులు, నిర్మాతల మధ్య కొనసాగుతున్న వివాదం త్వరగా పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. పేరాలలోని ధ్యాన కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలో తలెత్తిన సమస్య సాఫీగా ముగిసి, అందరూ మళ్లీ ఒక్కటిగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్మికులు, నిర్మాతలు ఇద్దరూ సినీ పరిశ్రమకు రెండు కళ్లవంటి వారని అన్నారు. ఒకరు లేకపోతే మరొకరు అసంపూర్ణం అన్నారు. అందువల్ల ఈ వివాదం త్వరగా పరిష్కరించుకోవడం పరిశ్రమ అభివృద్ధికి అత్యవసరమని అన్నారు. మానవ జీవితానికి ఆధ్యాత్మిక ధ్యానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. శరీరానికి ఆహారం



మాట్లాడుతున్న ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్

ఎంత అవసరమో మనసుకు ఆధ్యాత్మిక ధ్యానం అంతే అవసరం అన్నారు. ప్రస్తుతం తాము అఖండ-2, రాజాసాబ్, విశ్వంభరా, పెద్ది వంటి భారీ చిత్రాలకు ఫైట్ మాస్టర్స్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల కోసం అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు అందించేందుకు తమ బృందం కష్టపడుతోందని తెలిపారు. సినిమాలు కేవలం వినోదం మాత్రమే కాదు, మానవ భావోద్వేగాలను కలిపే శక్తి కలిగిన వేదిక అన్నారు.

వధూవరులకు టిడిపి నాయకుల ఆశీర్వాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన దీప్తి, నాగమనోహర్ల వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదన ప్రసాద్, టిడిపి బిసి సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కర్, బాలాజీ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, వేమూరు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జంగం శాంసన్, వేమూరు ఎస్సీ సెల్ కార్యదర్శి పోకూరి సురేంద్ర ఆశీర్వదించారు.



వధూవరులకు బొకే అందజేస్తున్న టీడీపీ నాయకులు



నీటిని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయమ్మ

నాలుగు డెంగీ కేసులు నమోదు

ప్రజాశక్తి - నగరం

మండలంలోని ఈదుపల్లిలో విష జ్వరాల ప్రభావంతో ప్రజలు ఆర్ఎంపీల చుట్టూ తిరుగుతున్నారు. వైద్యం కోసం వెళుతున్న సందర్భంలో వాళ్ల వద్దకు వెళ్లవద్దనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందాలని, గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ తెలిపారు. ఆమె గ్రామంలో ఇంటింటికి తిరిగి సందర్భంలో ఆదివారం రోజు స్థానిక సిఎస్సి పరిధిలో నాలుగు డెంగ్యూ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈదుపల్లిలో రెండు, ముత్తుపల్లిలో రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం పరిశీలించారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని చెప్పారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు దూరంగా ఉంచాలని తెలిపారు. దోమల లార్వా నిర్మూలనకు శానిటేషన్ సిబ్బంది చేత బ్లీచింగ్, ఆయిల్ బాల్స్, స్ప్రే చేయించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఒంగోలు నగరంలో డి6 ఫంక్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ 316హెచ్ గవర్నర్ చందోలు హరిప్రసాద్, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా మల్టీ పుల్ మాజీ ఛైర్మన్ శాంతి పాల్గొని కొత్త సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షునిగా పార్థసారథి, సెక్రటరీగా లక్ష్మణ స్వామి, కోశాధికారిగా నందకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా మిరియాల కృష్ణమూర్తి, వంకదార సతీష్, గోపి కిషోర్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ గా విజయ్ కుమార్, క్లబ్ సంయుక్త కోశాధికారి జివి సత్యనారాయణ, క్లబ్ డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వర్లు, చలువాది శ్రీహరి, చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నయనాల రామకృష్ణ, బొమ్మల శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొన్నారు.



సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

ఇంటర్ విద్యలో

సుబ్బారావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ విద్యలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించిన వంగపల్లి వెంకట సుబ్బారావు సేవలు ఎనలేనివని ఇంటర్ విద్య ఆర్‌జెడీ జె.పద్మ, ఇంటర్ బోర్డు సీఓఈ ఎ.సైమన్ విక్టర్, ఓఎస్‌డీ వి.రమేశ్ ప్రశంసించారు. జూలై 31న నెల్లూరు డీఐఈఓగా ఉద్యోగ విరమణ చేసిన సుబ్బారావుకు ఆదివారం ఒంగోలు ఎకెవికె జూనియర్ కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా, ప్రకాశం జిల్లా ఆర్‌ఐఓగా, గుంటూరు ఆర్‌జెడీగా, పరీక్షల నియంత్రణ అధికారిగా, నెల్లూరు డీఐఈఓగా ఆయన చేసిన సేవలు అందరికీ మార్గదర్శకమని అభినందించారు. ఇంటర్ విద్య సంస్కరణల్లో సుబ్బారావు కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు-భారతి దంపతులను ఘనంగా సన్మానించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి కె. ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఐఈఓలు, ఆర్‌ఐఓలు పాల్గొన్నారు.

ధాన్యం కొన్న

24 గంటల్లోనే రైతుకు డబ్బులు

మంత్రి స్వామి

ప్రజాశక్తి-జరుగుమల్లి

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు డబ్బులిస్తున్నామని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటు పడుతోందని అన్నారు. జరుగుమల్లి మండలం, కామేపల్లి నుండి చిరికూరపాడు వరకు ఆదివారం అన్నదాత సుఖీభవ కతజ్ఞత భారీ ట్రాక్టర్ ర్యాలీని డాక్టర్ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి చిరికూరపాడులో మాట్లాడుతూ విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు అండగా ఉంటున్నామన్నారు. జగన్ పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసు పుస్తకాలపైనా తన బొమ్మ వేసుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాజముద్రతో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. గత ఐదేళ్లలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి జరుగుమల్లి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, టిడిపి సీనియర్ నాయకులు మక్కెన వెంకటరావు, కొమ్మాలపాటి కృష్ణ, దగ్గుమాటి సుబ్బారెడ్డి, పోటు శ్రీనివాసమురళి, రావి నాగేశ్వరరావు, వట్టిగుంట శివాజి, చదలవాడ బ్రహ్మేంద్రం, నలదల రామారావు, కొమ్మాలపాటి ప్రవీణ్, భారీగా జరుగుమల్లి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌పై మంత్రి స్వామి, దామచర్ల సత్య

ట్రైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర ట్రైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గా ఎస్‌కె ఖాసిం, ఎస్‌కె అల్తాఫ్ ఎన్నికయ్యారు. ఒంగోలు నగర ట్రైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఖాసిం భవనంలో ఆదివారం జరిగింది. తొలుత ఒంగోలు నగర ట్రైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం రాష్ట్ర సీనియర్ నాయకులు టెక్స్ ట్రైలర్ ఎస్‌కె హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ట్రైలర్స్ సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తుందన్నారు. ట్రైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా ప్రతినిధుల దష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కషి చేస్తామని పేర్కొన్నారు. కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా బి. శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా సి.హెచ్ సురేష్, కోశాధికారి ఎన్. బాల చైతన్యతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రైలర్స్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ఒంగోలు నగర ట్రైలర్స్ కార్యవర్గ సభ్యులు ఎస్ సందీప్, ఎస్‌కె జానీ, ఎస్‌కె రహమాన్, మాజీ అధ్యక్షులు ఎస్‌కె సుభాని పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ లెక్చరర్ల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత 25 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ కోసం సోమవారం విజయవాడ, తాడేపల్లిలోని రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు 475 అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డా. ఏసుపోగు జాన్ బాబు, ఎస్‌కే ఖాదర్‌వలీ, ఆనందరావు, బి. కాశీరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈ ధర్నాలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో పీర్లమాన్యం, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, సమతా నగర్, శ్రీరామ్ కాలనీ, శ్రీకష్ణ నగర్ తదితర ప్రాంతాలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

దూదేకుల సంక్షేమ సంఘం

యూత్ అధ్యక్షునిగా నరేష్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



నరేష్ (ఫైల్)

దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఒంగోలు చెందిన షేక్ నరేష్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డిపి.మస్తాన్ తెలిపారు. ఈ మేరకు నరేష్ కు మస్తాన్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. నరేష్ మాట్లాడుతూ జిల్లాలో దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నరేష్ తెలిపారు.

కూలి సమస్య నుంచి 'భూ హక్కుల' పోరాటం వరకు..

- గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘ ఉద్యమం
- ఈ నెల 12, 13 తేదీల్లో సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పేరుకే 'ప్రకాశం' అయినా.. అభివద్ధి కాంతి మాత్రం ఈ జిల్లాలో ఇంకా వెలుగులు విరజిమ్మలేదు. రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో ఉన్న అభివద్ధి సూచీలు, అందులోనూ వ్యవసాయ కార్మికుల పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. ఈ నెల 12, 13 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు కనిగిరిలో జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

కరువు, వలసలు, యంత్రాల దెబ్బ..

జిల్లాలో వరస కరువులు, ప్రకతి వైపరీత్యాలు, పాలకుల నిర్లక్ష్యం – అన్నీ కలగలసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయి. వనరులు ఉన్నప్పటికీ పారిశ్రామికంగా గానీ, వ్యవసాయంగా గానీ అభివద్ధి చెందేలా పటిష్ట చర్యలు పాలక వర్గాలు చేపట్టలేదు. వరి, పొగాకు, మిర్చి, ప్రత్తి వంటి ప్రధాన పంటలు సాగవుతున్నా.. యంత్రాల ప్రవేశం, కలుపుమందులు, కోత–నూర్పిడి యంత్రాల ప్రవేశంతో పనిదినాలను గణనీయంగా తగ్గించాయి. సంవత్సరంలో సెప్టెంబర్ నుండి ఏప్రిల్ వరకు మాత్రమే డిమాండ్ ఉన్నప్పుడు కూలీలు బిజీగా ఉంటారు. మిగిలిన నాలుగు నెలలు వలసలు తప్పని పరిస్థితి. ఉపాధి కోసం వలస వెళ్లిన కూలీలు ప్రమాదాల్లో మరణించిన ఘటనలు కోకొల్లలు.

పొగాకు-మిర్చి-ఉపాధి అస్థిరత

జిల్లాలో పొగాకు సాగు 2 లక్షల ఎకరాలకు పెరిగినా, 50 వేల మంది పచ్చాకు పనిలో కాంట్రాక్టు పద్ధతిలో కష్టపడతారు. రోజుకు 12 గంటలు పనిచేసినా, ఒప్పందం ముగిసే సరికి చెల్లింపులు ఆలస్యమవడం, పనుల్లో వేదింపులు, ప్రమాదాలు పెరుగుతున్నాయి. మిర్చి సాగు 56 వేల ఎకరాల్లో ఉన్నా, గిట్టుబాటు తగ్గిపోవడంతో పంట విస్తీర్ణం క్షీణిస్తోంది. పంట కోత కాలంలో వేతనాలు పెరిగినా, ఆ కొద్ది రోజులు తప్ప మిగతా కాలం ఉపాధి తగ్గుతుంది.

భూకేంద్రీకరణ-పేదలకు దక్కని భూమి...

జిల్లాలో 15.25 లక్షల ఎకరాల సాగుభూమిలో, చిన్న రైతులు సాగు నుంచి దూరమవుతుండగా, భూములు కొద్దిమంది పెట్టుబడిదారీ భూస్వాముల చేతుల్లో కేంద్రీకతమవుతున్నాయి. ప్రభుత్వ బంజరు, దేవాదాయ భూములలో పెద్ద భాగం వీరి అధీనంలోనే ఉంది. దళిత–గిరిజన వర్గాల భూసమస్యలు కో కొల్లలు. జిల్లాలో దళితులు 23.48 శాతం, గిరిజనులు 3.86 శాతం. భూముల కొరత, భూ హక్కుల లేమి, విద్య, ఆరోగ్యం, ఉపాధి లోటు – సమస్యల జాబితా అంతం లేనిది. ప్రభుత్వం పంచిన 70 వేల ఎకరాలు భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి.



వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

భూ సమస్యలపై నిరంతర ఉద్యమం..

వ్యవసాయ కార్మిక సంఘం ఈ క్లిష్ట పరిస్థితుల్లో పేదల కోసం భూసమస్యలపై అనేక ఉద్యమాలు, ఆందోళనలు నడిపింది. హనుమంతునిపాడు మండలం, హాజీపురం గ్రామంలో పేదల సాగులో ఉన్న 150 ఎకరాలను అక్రమ రిజిస్ట్రేషన్ల నుండి కాపాడి అర్హులకు ఇవ్వాలని నాలుగు గ్రామాల ప్రజలను కూడ గట్టి ఉద్యమం చేపట్టారు. ఆ ఉద్యమం ఇంకా కొనసాగుతుంది. సిఎస్‌పురం ఎక్స్‌ప్రెస్ హైవే పక్క అనేక సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న గిరిజనులను ఖాళీ చేయించాలనే ప్రయత్నాలను ఎదిరించి.. పాలక పార్టీల నుంచి గిరిజనుల ఇండ్ల స్థలాలను కాపాడి వారికి అప్పగించారు. నల్లమడుగుల, గుంతచెన్నంపల్లి ఇండ్ల స్థలాల సమస్యలపై అనేక సార్లు ఆందోళన చేపట్టారు.

పిసిపల్లి మండలం కోదండరామపురం–మెట్లవారిపాలెం గ్రామాల్లో 1994లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన 44 ఎకరాలను అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అక్రమార్కుల నుంచి 2023లో తిరిగి లబ్ధిదారులకు హక్కు పత్రాలు తిరిగి పొందేందుకు అనేక ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టి భూమిలో విత్తనం వేసే స్థాయికి చేరుకుంది. ముండ్లమూరు మండలం గంగనపాలెం గయాళ్ భూమి 21 ఎకరాలను 80 కుటుంబాల పేదలకు పంచి సాగుచేసే దిశగా భరోసా అందించారు. మార్కాపురం మండలం నాగులవరం పేదల ఇండ్ల స్థలాల కోసం.. కొత్తపట్నం మండలం ఈతముక్కల భూ సమస్య పై ఉద్యమం చేపట్టారు. కాగా 2023 లో అసైన్డ్ భూములపై ప్రభుత్వం తెచ్చిన జిఓ రద్దు కోరుతూ ఆందోళన చేపట్టిన నేపథ్యం వ్యవసాయ కార్మిక సంఘానికి ఉంది.

సామాజిక సమస్యలపై స్వరం...

సంతనూతలపాడు మండలం మాచవరం స్మశాన స్థలాల రక్షణ, చంద్రపాలెం దళిత యువకునిపై దాడికి నిరసన, పీసీపల్లి మండలం అలవలపాడు దళిత కాలనీ రోడ్డు సమస్యలు, పాఠశాలల మూసివేతకు వ్యతిరేకంగా బహుళ స్థాయి పోరాటాలు జరిగాయి. 'బడి విలీనం' పేరుతో 54 స్కూళ్ల, అందులో ఎక్కువ భాగం దళితవాడల్లో మూసివేయడాన్ని మండలాల నుండి జిల్లా స్థాయికి వ్యతిరేక నిరసనలు నడిపారు. ముఖ్యంగా హనుమంతునిపాడు మండలంలో 15 స్కూళ్లలో 12 దళిత వాడల్లో మూసివేతపై ఆందోళన చేపట్టారు.

పోరాటాలు ఆగవు..



కంకణాల ఆంజనేయులు,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

వ్యవసాయ కార్మిక సంఘం భూ పోరాటాలలో కొంత విజయాన్ని సాధించినా.. ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. వలసలు, అప్పులు, ఉపాధి, వైద్యం,కూలీల భద్రత, యంత్రాల ఆధిపత్యం – ఇవన్నీ వ్యవసాయ కార్మికుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. అయినా, పేదల భూహక్కుల కోసం, దళిత–గిరిజన ఆత్మగౌరవం కోసం, ఈ పోరాటాలు ఇంతటితో ఆగేవి కావు. భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నంత కాలం పోరాటాలు కొనసాగుతాయి.

అన్నదాతల అభ్యున్నతికి కృషి

- సహకార సంఘాలకు త్రి సభ్యుల నియామకం
- చైర్మన్, డైరెక్టర్లకు ఏలూరి అభినందనలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రైతాంగానికి సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలవాలని, అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు పనిచేయాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సహకార సంఘాలకు చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతం కోసం నూతన త్రిసభ్య కమిటీలు పని చేయాలని అన్నారు. రైతులకు సేవలు విస్తృతం చేయాలని చెప్పారు. రైతాంగానికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలని అన్నారు. నూతనంగా నియామకమైన చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కొలలపూడి పిఏసిఎస్ చైర్మన్ తాటి నాగార్జున, డైరెక్టర్లు ఎడవల్లి ఆదినారాయణ, మెట్టల నాగేశ్వరరావు, వలపర్ల పిఏసిఎస్ చైర్మన్ కంభంపాటి హనుమంతరావు, డైరెక్టర్లు తన్నీరు అంకమ్మ, నతాని మునీబాబు, చింతగుంపల పిఏసిఎస్ చైర్మన్ బత్తుల శ్రీనివాసరావు, డైరెక్టర్లు సందు శ్రీనివాసరావు, యాదల నాగేశ్వరరావు, నీలాయపాలెం పిఏసిఎస్ చైర్మన్ తుమాటి రంగనాయకులు, డైరెక్టర్లు ఆసోది కోమలి, గడ్డం సుబ్బారావు, కారంచేడు పిఏసిఎస్ చైర్మన్ పోతిని నాగేశ్వరరావు, డైరెక్టర్లు మైలా బ్రహ్మయ్య, రామవరపు వెంకటేశ్వర్లు, కుంకలమర్రు పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రమూడి బంగారు బాబు, డైరెక్టర్లు కొత్త రెడ్డి వీరయ్య, కడియం రాంబాబు, కొడవలివారిపాలెం పిఏసిఎస్ చైర్మన్ కోసరాజు సునీల్, డైరెక్టర్లు కొడవలి శ్రీనివాసరావు, నెల్లూరు శ్రీనివాసరావు, అడుసుమల్లి పిఏసిఎస్ చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు, డైరెక్టర్లు అన్నవరపు శ్రీనివాసరావు, మూకిరి వెంకట సుబ్బయ్య, ఇసుకదర్శి శ్రీరామ పిఏసిఎస్ చైర్మన్ జాగర్లమూడి హనుమంతరావు, డైరెక్టర్లు షేక్ మాబు, కందుకూరి ఆంజనేయులు నియమితులయ్యారు.



ఏలూరి సాంబశివరావు

ప్రైవేటు ఫైనాన్స్ ఆగడాలు అరికట్టాలి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు ఎక్కువయ్యాయి. కిస్తీ డబ్బులు చెల్లించలేదని ఆడవాళ్లను ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి ఇంటికి తాళం వేసి సీలు వేసిన ఘటన మరిచిపోక ముందే ఒక నెల కిస్తీ చెల్లించలేదని ఫోర్ వీల్ ఆటో, ఆటోలో ఉన్న వాటర్ క్యాన్లను, వాటర్ ట్యాంకును తీసుకెళ్లిన సంఘటన మండలంలోని భగవాన్ రాజుపాలెంలో జరిగింది. ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర అప్పు తీసుకుని వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న తమను ఒక నెల కిస్తీ ఆలస్యమైనందుకు జీవనాన్ని దెబ్బతీసే విధంగా కంపెనీ సిబ్బంది చేశారని చింతలచెరువు విజయ్, అతని భార్య సామ్రాజ్యం 'ప్రజాశక్తి' ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అల్ట్రాంగ్ క్రెడో హెూం ఫైనాన్స్ దగ్గర ఇల్లు తాకట్టు పెట్టి రూ.7.90లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఇన్సూరెన్స్ కింద రూ.36 వేలు, ప్రాసెసింగ్ ఫీజు, మార్ట్ కేజీ, రెండు నెలల కిస్తీ కింద కలిపి రూ.లక్ష తీసుకున్నారని తెలిపారు. తమ చేతికి రూ.6.90లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. వీటి మొత్తంకు నెలకు రూ.14,440 చొప్పున పదేళ్ల పాటు చెల్లించాలని అన్నారు. తాము ఆ డబ్బుతో వాటర్ ప్లాంట్ నిర్వహించుకుంటూ నెల నెల కిస్తీలు సక్రమంగానే చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల వాటర్ ప్లాంట్లో మిషన్ చెడిపోవడంతో ఒక నెలకి కిస్తీ చెల్లించలేకపోయానని, దీంతో జులై 31న రాత్రి 12 గంటలకు తన ఫోర్ వీల్ ఆటో, ఆటోలో ఉన్న 33 వాటర్ క్యాన్లు, 2వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, రూ.450 నగదు దౌర్జన్యంగా ఫైనాన్స్ సంస్థకు చెందిన నలుగురు వ్యక్తులు వచ్చి తీసుకువెళ్లిపోయారని తెలిపారు. ఆ కిస్తీకి సంబంధించి రూ.5 వేలు చెల్లించాలని, మిగతావి రేపు ఉదయం చెల్లిస్తానని చెప్పిన వినకుండా ఆటో తీసుకెళ్లారని చెప్పారు. ఒక కిస్తీ ఆలస్యమైనప్పుడు అందుకు పెనాల్టీగా రూ.1300 తీసుకుంటారని, పెనాల్టీతో చెల్లిస్తానని చెప్పిన వినలేదని అన్నారు. ఆటో తీసుకోవడంతో తన కుటుంబ జీవనం ఆగిపోయిందని, ఆటో ఉంటే నిరంతరం వాటర్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటామని చెప్పారు. ఈ విషయమై ఈనెల 4న రేణింగవరం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని, పోలీసులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్ని చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తమకు ఫోర్ వీల్ ఆటోనే జీవనాధారమని, అది లేకపోతే తమ కుటుంబం కుంటుబడి పోతుందని తెలిపారు. ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు అరికట్టి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.



ప్రైవేట్ ఫైనాన్స్ బాధిత దంపతులు

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బాపట్ల

కాలానుగుణ ప్రమాదకర వ్యాధుల పట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డిఓ పి గ్లోరియా అన్నారు. పట్టణంలోని 3వ వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో యానాదులు నివసించే ప్రాంతాన్ని మునిసిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. వ్యాధులు ప్రబల కుండా పురపాలక సంఘం తీసుకుంటున్న చర్యల వివరాలు తెలుసుకున్నారు. గడిచిన కొన్ని రోజుల నుండి దోమల నివారణకు ప్రతిరోజు విధిగా ఫాగింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి నిలవలపై యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారి చేస్తున్నామని తెలిపారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా ఈపాటికే పట్టణంలోని అన్ని నీటి కుంటల్లో దోమల లార్వాను తినే గంబూషియా చేపలు విడుదల చేశామని అన్నారు. వార్డుల్లోని అన్ని డ్రైనేజీల్లో మట్టి పూడికలు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ కాలనీని ఆనుకోని వున్న నీటి కుంటలోని నీటిని గత 3 రోజులుగా మోటార్లతో డ్రైనేజీలోనికి తరలిస్తున్నామని తెలిపారు. ఈ చెరువు ఆనుకొని యానాదుల కుటుంబాలు గత కొన్నేళ్ళుగా నివసిస్తున్నారని అన్నారు. లోతట్టు ప్రాంతమైనందున వర్షాకాలం చెరువు నిండి వర్షపు నీరు వారి నివాస గుడిసెల్లోకి వస్తుందని ఆర్డీఒకు వివరించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే నరేంద్రవర్మ దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర అనారోగ్య పరిస్థితులు తలెత్తితే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్యం చేయించుకోవాలని అన్నారు. సచివాలయ ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు వ్యాధులు గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారని అన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఒ



బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

స్కూల్ బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

?గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎస్ టు నీడ్ ఫౌండేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని ఫౌండేషన్ నిర్వాహకులు తోట సురేష్ బాబు అన్నారు. మండలంలోని అడవిపల్లెపాలెంలో పేద విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్యాగులు పంపిణీ చేశారు. గత ఐదేళ్లగా సాయంకాల సమయంలో విద్యార్థులకు ఎస్ టు నీడ్ గ్రామీణ విద్యా కేంద్రంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా కేంద్రంలో విద్యార్థులకు స్కూలు బ్యాగులు అందజేశామని అన్నారు. కూలి పనులు, చేతి వృత్తులపై ఆధారపడిన తల్లి, తండ్రుల పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు అసోసియేషన్ తమ వంతు కర్తవ్యం నిర్వర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి నాని బాబు, గోగు శివ, గరికిన శిరీషా, సిరిపిల్లి సత్యవతి, పీక్కి కుమార్, చోడిపిల్లి భాగ్యవతి, తిర్రి ద్రాక్షావలి, ఎరిపిల్లి కొండమ్మ, దోనీ భాను, చోడిపిలి గురయామా, చోడిపిల్లి కాశయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు రావూరి వేణుబాబు

సంక్షేమ పథకాలు అందడం లేదు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలో వైసిపి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో 'బాబు షురిటీ, మోసం గ్యారెంటీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. ప్రజలు తమ పిల్లలకు తల్లికి వందనం వంటి పథకాలు అందలేదని తెలిపారు. చిన్న పని కావాలన్నా అధికారులు, టిడిపి నాయకుల ద్వారా చెప్పించాలని అంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉప్పలపాటి అనిల్, దొడ్డ రవి, జాగర్లమూడి మాజీ సర్పంచ్ నక్క పోతిరెడ్డి, ప్రకాష్, మార్టూరు కన్వీనర్ వీరయ్య చౌదరి, మైలా చిన నాగేశ్వరరావు, నల్లపనేని వీరేంద్ర, లక్ష్మీనారాయణ, జంగా ఏలియా, రాయి ఆదాం, శ్రీను, రాంబాబు, అఖిల్ బాబు, వందనం సవరప్ప, నాగరాజు, తిరుపతి రాజబాబు, టి ప్రేమ్ కుమార్, అనంతవరం నాయకులు కొత్తపల్లి వెంకట్రావు, పెరవలి శ్రీనివాసరావు, సవరప్ప రవి, జూపల్లి విజయ్‌కుమార్, నలమాల ఆశి పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. చెరుకుపల్లి శివారులోని పాడుబడ్డ గృహంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో సోదా నిర్వహించి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుండి రూ.4700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కారును ఢీ కొట్టిన బైక్

ప్రజాశక్తి - పంగులూరు

ముందు వెళుతున్న కారును అతివేగంగా రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయపడ్డారు. ఒంగోలు నుండి జాతీయ రహదారిపై విజయవాడ వెళుతున్న బొలెరో కారును రేణింగవరం ఫ్లైఓవర్‌పైకి వచ్చే సమయానికి వెనుక వైపుగా అతివేగంగా వచ్చిన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఎ స్టాలిన్, కె ఇసాక్ అనే ఇద్దరికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

ధేనువకొండలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని దేనువకొండ జెడ్పి ఉన్నత పాఠశాల ఆవరణలో బొడ్డు శేషయ్య, తిరుపతమ్మ, గోకతోటి అక్కయ్య, ఆదెమ్మ జ్ఞాపకార్థం బొడ్డు కుటుంబరావు ఆధ్వర్యంలో ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 350 మందికి షుగర్, బిపి, గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. ఈసిజి, ఛాతి సంబంధ వైద్య పరీక్షలు, పిఎఫ్టిలు నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ జయవర్ధన్, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నుండి ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారికి 15 రోజుల పాటు ఉచిత ఒపి, నిర్ణీత వైద్య పరీక్షలపై 50శాతం రాయితీ ఇస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలిపారు. గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం పొందడానికి ఉపయోగ పడుతుందని గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల తెలిపారు. వైద్య శిబిరంలో బొడ్డు కుటుంబరావు, గోకతోటి గోపీకృష్ణ, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బి ఆనంద్ కుమార్, ఆర్థోఫిజియో అసిస్టెంట్ డాక్టర్ జగదీష్, పిఆర్ఓలు ఇస్లాం, మల్లిఖార్జున, రాము పాల్గొన్నారు.



తెనాలి వైద్యశాలకు తరలుతున్న క్షతగాత్రులు

ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కొనేటిపురంకు చెందిన కొందరు గ్రామస్తులు ఆదివారం కృష్ణా జిల్లా పామర్రు సమీప గ్రామంలోని అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. టాటా ఎసిలో సూరేపల్లి, వేమవరం గ్రామం మీదుగా 216 జాతీయ రహదారిపై ప్రయాణించేందుకు బయలుదేరారు. వేమవరం దాటి జాతీయ రహదారికి వెళ్లే ప్రాంతంలో ఉన్న మలుపు వద్దకు రాగానే టాటా ఏసి వెనక డోర్ ఒక్కసారిగా విరిగి పడటంతో డోర్‌పై కూర్చున్న నలుగురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో గాయాలపాలైన బాధితులను అదేవాహనంలో భట్టిప్రోలు ప్రభుత్వ వైద్య శాలకు బంధువులు తీసుకు రాగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. వీరిలో మర్ల వెంకయ్యకు చెవి రంధ్రం నుంచి రక్తం వస్తుండడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదంలో గాయపడ్డ జొన్న రత్తయ్య, వెంకటేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావు, వెంకయ్యను మెరుగైన చికిత్స కోసం 108లో తెనాలికి తరలించారు.

చేనేతకు ప్రోత్సాహంపై 11న ర్యాలీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చేనేత రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తూ చేనేత కార్మికుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని, చేనేతలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఈనెల 11న మంగళగిరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చేనేత నాయకులు మాచర్ల నాగరాజు తెలిపారు. చేనేత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాత మంగళగిరి పద్మశాలి కళ్యాణ మండపం నుండి చేనేత ఉత్పత్తుల ప్రదర్శనతో హుస్సేన్ కట్ట, మిద్దె సెంటర్, మెయిన్ బజార్ మీదుగా గాలిగోపురం వరకు ర్యాలీ జరుగుతుందని అన్నారు.



ఎం నాగరాజు



ఈత పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన స్విమ్మర్లు

జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమైన స్విమ్మర్లు

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ స్థాయిలో గుజరాత్‌లో జరిగే ఈత (వాటర్ పోలో) పోటీలకు పట్టణానికి చెందిన ఉప్పాల డోనాల్డ్ వెంకట గౌడ్, చందోలు గ్రామానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ ఎంపికైనట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి తెలిపారు. గుజరాత్ ఆక్వాటిక్ అసోసియేషన్, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 17 వరకు గుజరాత్‌లో నారన్ న్యూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటెక్ ఛాంపియన్ షిప్ జాతీయ స్థాయి సీనియర్ ఈత పోటీల్లో స్విమ్మర్లు ఉప్పాల డోనాల్డ్ వెంకట గౌడ్, షేక్ ఖాజా మొహిద్దీన్ పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈత పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పతకాలు సాధించినట్లు తెలిపారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మక్కెనవారిపాలెంలోని లంబాడి డొంక గ్రావెల్ రోడ్డు 2.5 కిలోమీటర్ల దూరం పనులు స్థానిక నాయకులు కొబ్బరికాయలు కొట్టి జెసిబితో ఆదివారం ప్రారంభించారు. ఎన్నోఏళ్లుగా ఇబ్బంది పడుతున్న రైతుల ఆశలు నెరవేరనున్నాయని నాయకులు పేర్కొన్నారు. రైతులు గ్రామం నుండి పొలాలకు వర్షా కాలంలో వెళ్లాలంటే బురదతో ఎంతో ఇబ్బంది పడేవారని, ఈ డొంక గ్రావెల్ రహదారికి కొన్ని నెలల కిందటే రూ.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల వ్యవధిలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని స్థానిక నాయకులు మెడికల్ శ్రీను తెలిపారు. కార్యక్రమంలో మక్కెన అంజయ్య, గొట్టిపాటి అంజయ్య, దూళ్ల శ్రీను, డి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

12న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, శారద ఐటిఐ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న ఇసుకపల్లిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి ప్రణయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు ప్రైమరీ ఎనర్జీ, గ్రెస్ట్ టెక్నాలజీ, గోదావరి బ్యాంక్, ఎంఆర్ఎఫ్, గ్రీన్ టిక్, అపెక్స్ సొల్యూషన్, హెటిరో లాబ్స్, దివిస్ లాబ్స్, డక్షన్ బిజినెస్ సొల్యూషన్స్, డ్రైకిన్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 1500కుపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతను బట్టి రూ.12వేలు నుండి రూ.20 వేలు వరకు నెలవారీ వేతనం ఉంటుందని అన్నారు. జాబ్ మేళాకు ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, బిటెక్, ఫార్మసీ, పిజి విద్యార్హతలు కలిగిన 18 నుండి 30 ఏళ్ల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా లేదా రెస్యూమ్ తీసుకుని హాజరు కావచ్చని తెలిపారు. ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్, ఆధార్, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. జాబ్ మేళాకు వచ్చే వారు ఆధార్‌కు లింకైన మొబైల్ అందుబాటులో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 96406 95229 నంబరులో కాని, https://naipunyam. ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99888 53335 లేదా పై సూచించిన నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

గౌడ సామాజిక వర్గం అభివృద్ధికి 10 శాతం బార్ షాపుల కేటాయింపుతో పాటు లైసెన్స్ చెల్లింపులో 50 శాతం రాయితీ ప్రకటించడం పట్ల శాసన సభ్యులు వేగేసిన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో గౌడ సంఘీలు చంద్రబాబు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పాలాభిషేకం అనంతరం శాసన సభ్యులు నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల అభివృద్ధికి చంద్రబాబు పెద్దపేట వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, బొంతు శివసామిరెడ్డి, గొలపల శ్రీనివాసరావు, కర్న్యా రపు రామారావు, పరిశా రమేష్ గౌడ్, మారీదు వెంకటేశ్వరరావు, కందుల బాల కోటేశ్వరరావు, సురగాని శేఖర్, కర్న్యారపు వేణు, మురళి, తాతా చినబాబు, కృష్ణ గౌడ్, విచారపు మునేశ్వరరావు, గుడిపల్లి సాంబశివ రావు, రవి, శివబాబు, పాములు, చలమయ్య, కేసాని వీర రాఘవులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఎన్నికల సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రకటించిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని గౌడ సంఘం నాయకులు వాకా ఆనంద శేషుబాబు అన్నారు. మండల కేంద్రమైన భట్టిప్రోలు ఎఎంసి యార్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద గౌడ సంఘం, గీత కార్మికులు సిఎం చంద్రబాబు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అనగాని ఏడుకొండలు, ఆరేపల్లి సుబ్బారావు, బొర్రా శరబంది, యరగళ్ల సాంబయ్య, వాకా పొరావు, వాక శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాసరావు, యార్లగడ్డ పాండురంగారావు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న గౌడ సంఘ నాయకులు

సేవా దృక్పథం అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

సమాజ సేవలో ముందుండి ప్రజలకు చేయూత ఇవ్వడం గొప్ప లక్షణమని, అటువంటి సేవా దృక్పథంతో ఉన్నం సంగీతరావు జ్ఞాపకార్థంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి సేవా గుణం చాటుకోవటం ప్రశంసనీయమని ఎపి హైకోర్టు న్యాయమూర్తి జజె సుమతి అన్నారు. ఐఎల్‌టిడి రోడ్డు లో ఉన్నం సంగీతరావు, ఎంఎంజి ఫ్లోరెన్స్ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా వారి ఆశీస్సులతో కుమారుడు యు ప్రసాద్ బాబు, మనవరాలు డాక్టర్ ఉన్నం షెల్లీ ఫ్లోరెన్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఎపి హై కోర్టు జడ్జి సుమతి వైద్య శిబిరం ప్రారంభించారు. ప్రసాద్ దయా గ్నోస్టిక్స్ సహకారంతో జరిగిన క్యాంపులో వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 400 మందికిపైగా ప్రజలు సేవలు పొందారు. రెండో పట్టణ సిఐ నాగభూషణం, డాక్టర్ నీలం జి మోహనార్జున్, డాక్టర్ ఇవాంజెలినా బ్లెస్సి, డాక్టర్ జోష్నా, డాక్టర్ ప్రమోద హరి, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ పుష్ప, డాక్టర్ కోలా విజయ శేఖర్, డాక్టర్ సూర్య తేజ, డాక్టర్ వి రాజా సిల్వర్, డాక్టర్ దీప్తి గ్రేస్, డాక్టర్ యు షెల్లీ ఫ్లోరెన్స్, యు.కిరణ్ పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జె సుమతి

మెరుగైన పారిశుధ్యంతో వ్యాధుల నుండి రక్షణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని గురిజేపల్లిలో డ్రైనేజీలో ఉన్న మురుగు నీరు బయటకు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు ఏర్పాటు చేసి డ్రైనులన్ని పారే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ వేణుగోపాలరెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గురుజేపల్లి, చవిటిపాలెం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. గతంలో ఈ రెండు గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి ప్రబలి జ్వరాలు సోకాయని ఆయన గుర్తు చేశారు. సర్పంచి దమ్ము వెంకటరమణ, శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పెరుమాళ్ళ వీరయ్య, ఎంపిడిఓ జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి మోహన్ చంద్, వేముల లక్ష్మయ్య పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలోని తిమ్మాయపాలెంలో జ్వరాల సర్వే, డ్రైడే కార్యక్రమాలు ఎంపిడిఓ బి సింగయ్య ఆదివారం పరిశీలించారు. వైద్య సిబ్బందితో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పంగులూరు : ప్రాణాంతకమైన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి ఎం అనంతరాజు కోరారు. మండలంలోని చందలూరు, తూర్పు తక్కెలపాడు, తూర్పు కొప్పెర పాడు, జనకవరం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. ఎంపిడిఓ కె సుమంత్, పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య, సెక్రటరీలు బొద్దు కళ్యాణి, మాధవి, సందీప్, రాంబాబు, మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

వివాదాలు రేపుతున్న మద్యం షాపులు

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిరుపేదల కుటుంబాల్లో కల్లోలం రేపుతున్నాయని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు గుదే రాజారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడీపీ నేతల కనుసన్నల్లోనే మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తుండటంతో శివారు పల్లెల్లో మద్యం అందుబాటులోకి తెచ్చారని అన్నారు. పగలంతా కష్టం చేసిన కూలి డబ్బులతో కార్మికులు మద్యం తాగి కుటుంబ సభ్యులతోపాటు గ్రామంలో గొడవలు పడడంతో పచ్చని పల్లెలు తగాదాలు మయంగా మారుతున్నాయని అన్నారు. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు, తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్ షాపుకు వెళ్లి మద్యం తెచ్చుకునే పని లేకుండా అందుబాటులో బెల్ట్ షాపుల ద్వారా ప్రతీ పల్లె, పట్టణ, కాలనీల్లో ప్రభుత్వం బెల్ట్ షాపులతో దిగువ మధ్యతరగతి ప్రజలు ఇల్లు, ఒళ్ళు గుల్ల చేస్తున్నాయని అన్నారు. కుటుంబాల్లో మద్యం చిచ్చు రేపుతుందని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నియంత్రించి కుటుంబ వ్యవస్థ నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



యుటిఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుట, సామాజిక స్పృహ కలిగించుట యుటిఎఫ్ లక్ష్యమని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎం వెంకటేశ్వర్లరెడ్డి అన్నారు. యుటిఎఫ్ 52వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద యుటిఎఫ్ జెండా ఎగురవేశారు. యుటిఎఫ్ అధ్యక్షులు బివి శ్రీనివాస్, వెంకటేశ్వర్లరెడ్డి మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పనిచేస్తున్న అతి పెద్ద ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రతినిధులు బి భాను ప్రకాష్, డి శ్రీనివాసరెడ్డి, పి బాబుజిరెడ్డి, సతీష్, డి యేసురాజు, ఎ శ్రీనివాసరెడ్డి, బి రాజేష్, విశ్రాంతి ఉపాధ్యాయులు సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి మృతి

ప్రజాశక్తి - పంగులూరు



వెంకటస్వామి (ఫైల్)

మండలంలోని రేణింగివరం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకటస్వామి (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. చిన్నగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన ఆయన రేణింగవరం పోలీసు స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. డ్యూటీ నిమిత్తం ఒంగోలు వెళుతుండగా మార్గ మధ్యలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అతన్ని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా ఇరువురికి వివాహాలు చేశారు. ఆయన మృత దేహానికి ఎస్ఐ వినోద్ బాబు, సిబ్బంది సందర్శించిన నివాళులర్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని కారంచేడు రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలోనే యువకుడి తల శరీరం నుండి వేరై భయానక దృశ్యం నెలకొంది. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుర్తింపు కోసం సమీప ప్రాంతాల్లో విచారణ జరిపినా వ్యక్తి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్లుగా అంచనా వేస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 14న 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రోటరీ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ ఆదివారం తెలిపారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల సహకారంతో ఈ టాలెంట్ టెస్టును స్థానిక హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి తరగతి నుండి 5గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కావచ్చని తెలిపారు. మండల స్థాయిలో ఈ టాలెంట్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు తమ స్కూల్ విద్యార్థులను టాలెంట్ టెస్టులో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు. వివరాలకు 97047 42633 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పిటి.ఎల్.పి.డబ్ల్యు.ఏ డిమాండ్



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిటి.ఎల్.పి.డబ్ల్యు.ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యా రావు డిమాండ్ చేశారు. ముంగమూరు రోడ్డులోని శ్లోక ట్యూషన్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు వై. సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేటు ఉపాధ్యాయులు సుమారు రెండున్నర లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. కనీస వేతనాలు కూడా పొందని దురవస్థలో ఉన్నారని, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పిటి.ఎల్.పి. డబ్ల్యు.ఏ ఆధ్వర్యంలో విజయవంతం చేయాలని ఒంగోలు నగర ప్రైవేటు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలోయుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్. రవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు మాట్లాడారు. పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్న కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

కొబ్బరి పీచు పరిశ్రమ అభివృద్ధిపై ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కొబ్బరి పీచు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ రాంమంజ్హి సమాధానమిస్తూ రాష్ట్రంలో సహాయం పొందిన 743 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కొబ్బరి పీచు సంస్థలు ఉన్నాయని, అందులో 5,944 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. కొబ్బరి పీచు పరిశ్రమ అభివద్ధికి ప్రధాన కార్యక్రమాలను పిఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, కాయిర్ వికాస్ యోజన, ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ పథకాలను అమలు జరుగుతున్నాయన్నారు. కొత్త సంస్థలు ప్రాజెక్టుల ఏర్పాటుకు పిఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ పథకాలలో 35 శాతం సబ్సిడీతో బ్యాంకు అప్పులు, సాంకేతిక సహాయాలు అందజేస్తున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో పిఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో 2020-21 లో రూ.363.65 లక్షలు, 2021-22 లో రూ.429.21 లక్షలు, 2022-23 లో రూ.451.79 లక్షలు, 2023-24 లో రూ.292.34 లక్షలు, 2024-25 లో రూ.218.20 లక్షలు సబ్సిడీ ఇచ్చామన్నారు. ప్రకాశం జిల్లాలో 2021-22లో రూ.5.25 లక్షలు, 2022-23 లో రూ.2.58 లక్షలు, 2023-24లో రూ.3.50 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ లో ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు రూ. 395.50 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. కాయర్ బోర్డు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఒక జీవనోపాధి వ్యాపార సంస్థను ఏర్పాటుచేసి, కొత్త కొబ్బరి పీచు ప్రాజెక్టుల ఏర్పాటుకు లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నదని మంత్రి తెలియజేశారు.

ఎఫ్‌ఎ-1 ప్రశ్నాపత్రాలు పాఠశాలలకు చేర్చాలి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 11 నుంచి జరగనున్న ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు సిఆర్‌పిల ద్వారా పాఠశాలలకు చేర్చాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు క్లస్టర్‌కు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఆర్‌సి సెంటర్లకు వెళ్లి ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్లమని మండల విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయని, కొన్ని పాఠశాల లు మండల కేంద్రానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. పాఠశాలను వదిలి పరీక్ష పేపర్లకు వెళ్ళటంతో చాలామంది మహిళా ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు మండల కేంద్రాలకు వెళ్లుటకు సమయం చాలదని, కాంప్లెక్స్ లలో ప్రశ్నాపత్రాలు చేర్చి సిఆర్‌పిల ద్వారా పాఠశాలలకు సరఫరా చేయాలని వారు కోరారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల యూనియన్

అధ్యక్ష, కార్యదర్శులుగా సోమయాజులు, కల్పన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



సోమయాజులు



కల్పన

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా పిన్ని సోమయాజులు, కార్యదర్శిగా పి.కల్పనను 5వ మహాసభ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా 5వ మహాసభ ఆదివారం నాడు సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మహాసభలో మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పిల్లల మెనూ ఛార్జీని రూ.20కు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు బిల్లులు, జీతాలు చెల్లించాలని తీర్మానించారు. అలాగే, జనవరి నుండి కాలేజీ విద్యార్థుల పెట్టె భోజనానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, బిల్లులు-వేతనాలు అందించాలంటూ మహాసభ డిమాండ్ చేసింది.

ప్రకృతి సేద్యం ద్వారా నాచు ఉత్పత్తి

పంట సాగుతో మత్స్యకారులకు జీవనోపాధి



పెదగంజాం వద్ద నాచు సాగును పరిశీలిస్తున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పరిధిలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. దాని వెంబడి సముద్రపు నాచు (సీవీడ్) ఉత్పత్తికి అనుకూలంగా ఉంది. తీరప్రాంత మత్స్యకార కుటుంబాలకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా సీవీడ్ ఉత్పత్తి జరిపేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలోని పెదగంజాం ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు కింద మత్స్యకారుల ద్వారా ప్రయోగాత్మకంగా నాచు ఉత్పత్తి చేపట్టారు. ఇప్పటి వరకు 4 టన్నుల మేర ఉత్పత్తి జరిగింది. ఇక్కడ వచ్చే ఫలితాలు, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం జిల్లాలోని తీరప్రాంతంలో నాచు ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించను న్నారు. సముద్రపు నాచు (సీవీడ్) అనేది ఇప్పుడు ప్రపంచదేశాల్లో చాలా విలువైనదిగా ఉంది. ఈ నాచు పలు పోషకాల నిధిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పలు దేశాల్లో దీన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. నాచుతో బిస్కె ట్లు, పాస్తా, నూడిల్స్ తయారు చేస్తున్నారు. మందులు, ఎరువులు, పశువుల దాణాగా ఉపయోగిస్తున్నారు. మన దేశంలో వీటిని ఐస్‌క్రీమ్స్, కాస్మోటిక్స్‌లో వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ దీనికి ప్రాధాన్యత పెరుగుతోంది. ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం లభించే సముద్రపు నాచు తయారీకి ప్రాధాన్యం పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం కూడా పిఎం యోజన పథకంగా ద్వారా నాచు తయారీకి ప్రాధాన్యత ఇస్తోంది. అందుకు కావాల్సిన సాంకేతిక సహకారం, ఆర్థిక చేయూతనందిస్తుంది. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో సముద్రపు నాచును సాగు చేస్తున్న క్రమంలో బాపట్ల జిల్లాలో కూడా ఈ సాగుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు.

సముద్రపు నాచుగా పిలిచే దీనిలో పలు రకాలు ఉన్నాయి. కప్పాఫైకస్ అల్వారిజి , గ్రేసిలేరియా, కప్పాఫైకస్, ఉల్వా, సర్గాస్సమ్ అనే రకాలు ముఖ్యమైనవి. ఇవి ఆకుపచ్చ, ఎరుపు, మట్టి రంగుల్లో ఉంటాయి. బాపట్ల జిల్లాలోని సముద్ర తీరం కప్పాఫైకస్ అల్వారిజి రకం నాచుకు అనుకూలం అని చెబుతున్నారు. కొన్ని దేశాల్లో దీన్ని నేరుగా ఆహారంలో తీసుకుంటున్నారు. నేరుగా తినలేని వాళ్ల కోసం ప్రత్యేకంగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సిఐఎఫ్‌టి) వారు బిస్కెట్లు, పాస్తా, నూడిల్స్, సూప్ పౌడర్స్ రూపంలో తయారీ చేసి సరఫరా చేస్తున్నారు. పెరుగు రూపంలో ద్రాక్షతో కలిపిన జ్యూస్‌లు తయారు చేస్తున్నారు. వస్తువుల ప్యాకింగ్ కోసం దీన్ని ఉపయోగించేలా ఫిల్మ్ కూడా తయారు చేస్తున్నారు. సముద్రంతో పాటు తీరప్రాంత చెరువుల్లో కూడా ఈ నాచును పెంచే ప్రయోగాలు చేస్తున్నారు. రానున్న కాలంలో సముద్ర నాచు ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పుడు చేస్తున్న ప్రయోగాలు సఫలీకృతం అయితే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి ఆదాయం, ఉపాధి పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 150 కిలోల నాచును సాగు చేయడం ద్వారా 2 టన్నుల వరకు ఉత్పత్తి వస్తుంది. యూనిట్‌కు రూ.36 వేల వరకూ లాభం వస్తుంది. సముద్రపు అలలు తక్కువగా ఉండే ప్రదేశంలో సముద్రంలో రాఫ్ట్ పైపులు, వెదురు కర్రలలతో ట్యూబ్ లైన్ తరహాలో తయారు చేసిన అమరికపై నాచు సాగు చేస్తున్నారు. 45 నుంచి 60 రోజుల్లో పంట కోతకు వస్తుంది. యాభై కిలోల మొక్కలు నాటితే 180 కిలోల నుంచి 200 కిలోల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు.

నాచు ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేయూత

జిల్లాలోని పెదగంజాం సముద్ర తీరప్రాంతంలో ఇప్పటికే కప్పఫికస్ అల్వారెజి అనే ఎరుపు రంగు సముద్రనాచు ఉత్పత్తి జరుగుతుంది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇటీవల అక్కడికి వెళ్లి నాచు సాగును పరిశీలించారు. నాచు సాగు ద్వారా మత్స్యకారులకు, రైతులకు కొత్త ఆదాయ వనరులు ఏర్పడతాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వేట విరామ సమయంలో నాచు ఉత్పత్తి మత్స్యకారులకు మేలు చేస్తుందన్నారు. జిల్లాలోని తీరప్రాంతాలలో నాచు సాగుకు అనుకూలాంశాలు ఉన్నాయన్నారు. మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాన్ని నాచు సాగు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై రాఫ్ట్ పైపులు, వెదురు కర్రలు, ట్యూబ్ లైన్ అందించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర సముద్ర పరిశోధనా సంస్థల సహకారంతో తీరప్రాంతాలలో నాచు సాగును ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

- రైతు బజార్ల ద్వారా రైతులు, వినియోగదారులకు మేలు..
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వరలక్ష్మి





ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ విస్తృతంగా కృషి చేస్తుందని, రైతులు పండించిన గిట్టుబాటు ధర లభించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సహకారం అందించడం ట్రేడర్లకు, రైతులకు మధ్య సమన్వయం చేయడం వంటి అంశాల్లో మార్కెటింగ్ శాఖ కీలక భూమిక పోషిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వరలక్ష్మి ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభ్యమయ్యే వరకు మార్కెటింగ్ శాఖ భరోసా కల్పిస్తున్నట్లు ఆమె ప్రజాశక్తి 'ముఖాముఖి'లో వివరించారు.

ఏఎంసీల పరిధిలో 42 గోదాములు..

ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 10 ప్రధాన మార్కెట్ యార్డులు, 8 సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. రైతుల సౌకర్యార్థం ఈ యార్డుల్లో ప్రహరీ గోడలు, అంతర్గత రోడ్లు, గోదాములు, ప్లాట్‌ఫారాలు వంటి కనీస మౌలిక వసతులు పూర్తిగా అభివద్ధి చేయబడ్డాయి. జిల్లాలో 41,505 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 42 గోదాములు ఉన్నాయి. వీటివల్ల రైతులు తమ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ ఉంచుకోవచ్చు.

రూ.551.22 లక్షల మార్కెట్ ఫీజు..

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2632.00 లక్షలు మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నాం. జులై 2025 నాటికి రూ 719.01 లక్షలు లక్ష్యం కాగా రూ. 551.22 లక్షలు వసూలు చేశాం. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు డీనోటిఫై అవడం, కొన్నింటికి మార్కెట్ ఫీజు మినహాయింపు ఇవ్వడం వంటి పరిణామాలు, వాతావరణ అననుకూల పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం తగ్గడం, దిగుబడులు గణనీయంగా తగ్గడం వంటి పరిణామాలు ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయి.

మార్కాపురంలో మిర్చి యార్డు..

పశ్చిమ ప్రకాశం మెట్ట రైతులను దృష్టిలో పెట్టుకుని మార్కాపురంలో గుంటూరు తరహా మిర్చి కొనుగోలు మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం అక్కడ ఉన్న యార్డ్‌లో 14.93 ఎకరాలు స్థలం అందుబాటులో ఉందని, ఆ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజిల సదుపాయాలు అందుబాటులో ఉన్నందున మార్కాపురం మిర్చి యార్డ్ ఏర్పాటు వల్ల మార్కాపురం ప్రాంతం పాటు అన్ని ప్రాంతాల వారికి ప్రయోజనం చేకూరుతుంది.

అన్ని నియోజకవర్గాల్లో రైతు బజార్లు..

రైతు బజార్లు రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు విక్రయించుకునేందుకు, వినియోగదారులకు సరసమైన ధరలకు లభ్యమయ్యేలా దోహదపడుతున్నాయి. ప్రస్తుతం ఒంగోలు నగరంలో దిబ్బలరోడ్, లాయర్ పేట, కొత్తపట్నం బస్టాండ్ వద్ద 3 చోట్ల రైతు బజార్లు, వై.పాలెంలో రైతు బజారు ఉన్నాయి. కనిగిరిలో నిర్మాణం పూర్తి అయిప్రారంబానికి సిద్దంగా ఉంది.త్వరలో దర్శి రైతు బజారు నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. ఒంగోలు నగరంలో కర్నూలు రోడ్డు, రాంనగర్, చీమకుర్తి, మార్కాపురంలో రైతు బజార్లు ఏర్పాటు చేసేందుకు అవసరమయిన స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాము. ఇతర నియోజకవర్గాల పరిధిలో కూడా రైతు బజార్లు నెలకొల్పేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం

ఉల్లి, టమాటా ధరలు పెరిగిన సందర్భంలో వినియోగదారుల వద్దకు చేరేలా రైతు బజార్ల ద్వారా టమోటా, ఉల్లిపాయల సరఫరా జరిగింది.రూ. 47.80 లక్షల విలువైన 1200 క్వింటాళ్లు టమోటా, రూ.14.10 లక్షల విలువైన 415 క్వింటాళ్లు ఉల్లిపాయలు, మొత్తం రూ. 61.90 లక్షల విలువైన 1615 క్వింటాళ్లు సరఫరా చేశాం. ఈ ఏడాది కూడా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు చర్యలు చేపట్టాం.